క్లుప్తంగా

ఈవీఎంల పనితీరును తెలుసుకోవాలి

ఎర్రవల్లిచౌరస్తా: ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పీఓ, ఏపీఓలు ఈవీఎంల పనితీరుపై స్పష్టంగా తెలుసుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (ఆర్డీఓ) రాంచందర్ అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలలో పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే అలంపూర్ నియోజకవర్గంలోని అధికారులకు అందిస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. శిక్షణ పొందిన పీఓ, ఏపీఓలు పోలింగ్ బూత్‌లతో సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్‌లతో నివృతి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పరీక్ష

అయిజ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో సోమవారం ఒకేసనల్ (వృత్తి విద్య కోర్స్) పరీక్ష ప్రశాంతం ముగిసింది. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఇన్విజిలేటర్లు పరీక్ష నిర్వహించారు. మొత్తం 93 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

బిల్లులు రాక ఇబ్బందులు

మానవపాడు: మూడు నెలలుగా మాజీ సర్పంచ్‌లకు పనులు చేసిన బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ఆత్మలింగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినా ఇంతవరకు తమకు అందాల్సిన బకాయిలు అందలేదని పేర్కొన్నారు. సోమవారం సమావేశంలో మాట్లాడారు. మంగళవారం ఉదయం 10 గంటకు మండల కేంద్రంలో నిర్వహించే సమావేశానికి మాజీ సర్పంచ్‌లు హాజరుకావాలని సూచించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు బకాయిలు, ఎంబీ బుక్కులు తీసుకోని రావాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డికి వినతి పత్రం అందిస్తామని తెలిపారు.

మద్యం పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం శివారు కూడలిలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్స్ పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. సోమవారం వైన్‌షాపు నుంచి బస్వాపురానికి చెందిన పరమేష్ ఆటోలో తరలిస్తుండగా 99.840 లీటర్ల మద్యాన్ని బైరాపురం కూడలిలో ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. వాటి విలువ రూ.50,960 వేలు ఉంటుందని తెలిపారు. మద్యాన్ని ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌కు పరమేష్, కిరాణం యజమాని బోయ శ్రీహరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు సుబ్బారెడ్డి, ఏఎస్‌ఐ అయ్యన్న, జూనియర్ అసిస్టెంట్ చిన్న బాలు పాల్గొన్నారు.

మూడు నెలల్లో మొబైల్ రికవరీ

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలో డిసెంబర్ 2023లో దొంగలించబడిన వీఓ మొబైల్‌ను సోమవారం ట్రాప్ చేసి రికవరీ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మానవపాడు మండలం పెద్ద పోతులపాడుకు చెందిన చంద్రశేఖర్ ఫోన్ అలంపూర్ చౌరస్తాలో చోరీకి గురైంది. అలంపూర్‌లో పోలీసుల తనిఖీ నిర్వహించగా సోమవారం రికవరీ చేసి బాధితునికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది హుస్సేన్ పాల్గొన్నారు.

వాల్మీకుల సమస్యల పరిష్కారం

శాంతినగర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇవ్వాలని, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే వాల్మీకుల సమస్యలు తప్పకుండా తీరుతాయని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. వడ్డేపల్లి పుర పరిధిలోని పైపాడులో పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని సోమవారం ప్రారంభించారు. వాల్మీకి నాయకులతో సమావేశమయ్యారు. సమావేశంలో వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

గట్టు: పెంచికలపాడు గ్రామ కార్యదర్శిగా పని చేసి, బదిలీపై వెళ్లిన సుబాన్‌ను సోమవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామ కార్యదర్శిగా సుబాన్ మూడేళ్ల పని చేసి, గ్రామాభివృద్ధిలో పాలు పంచుకున్నట్లు తెలిపారు. అనంతరం కార్యదర్శిని ఘనంగా సన్మానించి, అభినందించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి దస్తగిరి, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు హలీంపాష, సత్యం, ఫీల్డ్ అసిస్టెంట్ గోవిందు, గ్రామస్తులు ఆకుల శంకర్, వడ్ల రాఘవేంద్ర, జలాల్, గౌస్, తిరుమలేష్, తిప్పన్న, అమీర్‌పాష, ఖాదర్‌పాష, తజీమ్, రాముడు, కృష్ణ, రాముడు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

గద్వాల అర్బన్: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన మ్యాథ్స్, సైన్స్, రీజనింగ్ ఒలింపియాడ్ పరీక్షల్లో జిల్లా కేంద్రంలోని అక్షర కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. వారికి సోమవారం హైదరాబాద్‌లోని భారతీయ విద్యాభవన్‌లో బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇస్రో, బెంగళూరు చంద్రాయన్–3, ఆదిత్య ఎల్1 ప్రయోగాల్లో కీలక పాత్ర పోషించిన శాస్త్రవేత్తల చేతుల మీదుగా విద్యార్థులకు మెమోంటోలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ రత్నంను లైఫ్ టైం అచివ్‌మెంట్ 2024 అవార్డుతో సత్కరించారు.

అడుగంటిన భూగర్భ జలాలు

- తాగునీటి కోసం ప్రజల ఇబ్బందులు
- సరఫరా కానీ భగీరథ నీరు
- వట్టిపోతున్న బోరుబావులు
- బిందెడు నీటికోసం నిరీక్షణ




ఉమిత్యాలతండాలో తాగునీటి కోసం నిల్చున్న గ్రామ ప్రజలు

కేటీదొడ్డి: రోజురోజుకూ ఎండలు తీవ్రత పెరుగుతుండటంతో బోరు, బావి, చేతిపంపుల్లోని భూగర్భ జలాలు అడుగంటాయి. వేసవి ప్రారంభంలోనే మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. గ్రామాల్లో అరకొరగా ఉన్న చెతిపంపులు, బోరుబావుల వద్ద ప్రజలు బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. కోట్లు ఖర్చు చేసిన మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ నల్లా కలెక్షన్ ఇచ్చినా వాటి ద్వారా నీటి సరఫరా కావడం లేదు. గ్రామంలో ఉన్న బావులు ఎండి పోవడంతో బోరుబావులు సైతం వట్టిపోయాయి. అరకొరగా ఉన్న చేతిపంపులతో తాగునీటి దప్పిక తీర్చుకుంటున్నారు.

మండలంలోని పరిస్థితి..

మండలంలోని 23 గ్రామ పంచాయతీలుండగా, 8 గ్రామ పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని పంచాయతీ అధికారులు తెలిపారు. సాంపురం, చింతకుంట, కేటీదొడ్డి, నందిన్నె, ఉమిత్యాలతండా, మల్లాపురం, ఈర్లబండ, కుచినెర్ల తదితర గ్రామాల్లో తీవ్రంగా నీటి ఎద్దడి నెలకొంది. ఆయా గ్రామాల్లో భూగర్భ జలాలు కనిష్ట మట్టానికి పడిపోవడంతో తాగునీటి ఇబ్బందులు పడుతున్నారు. చింతలకుంట, సాంపురం, గ్రామాల్లో పూర్తిగా మిషన్ భగీరథ నీరు కొన్ని విధుల్లో పూర్తిగా రాకపోవడంతో ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉంది. మండలంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపడుతున్నామని అధికారులు పేర్కొన్నారు.


సోంపురంలో తాగునీటి కోసం నిల్చున్న గ్రామ ప్రజలు


బైకుపై తీసుకెళ్తున్న తాగునీరు

తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నాం..



కొన్ని రోజులుగా తాగునీటి కోసం చాలా తిప్పలు పడుతున్నాం. ఉదయం లేచినప్పటి నుంచి నీటి కోసం పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తోంది. గ్రామంలో ఉన్న బోర్లలో నీరు రాకపోవడంతో ఉన్న ఒక్క బోరుబావి ద్వారా ఊరందరికీ నీటి సరఫరా చేయడం ఇబ్బందిగా ఉంది.

– వాలీయమ్మ, ఉమిత్యాలతండా

తాగునీరు సరఫరా లేదు..



మిషన్ భగీరథథ నీరు ఉదయం, సాయంత్రం సక్రమంగా విడువక పోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రెండు బిందెల నీరు రాగానే నల్లాలు బంద్ అవుతున్నాయి. దీంతో చేసేది ఏమీ లేక బోరుబావులను ఆశ్రయిస్తున్నాం. అధికారులు స్పందించి నీటి సమస్య లేకుండా చూడాలి.

– బొజ్జమ్మ, ఉమిత్యాలతండా

ముందస్తు చర్యలు చేపడుతున్నాం..

మండలంలో 23 గ్రామ పంచాయతీలలో 8 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య ఉందని గుర్తించాం. దీంతో ఆయా గ్రామాల్లో ముందస్తు చర్యల కోసం ప్రత్యేక ప్రణాళిక ద్వారా తాగునీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం. తాగునీటి సమస్య ఎక్కువ ఉంటే నీటి ట్యాంకుల ద్వారా సరఫరా చేసి నీటి ఎద్దడిని తీర్చేందుకు ప్రయత్నిస్తాం.

– ఎంపీఓ సయ్యద్‌ఖాన్, కేటీదొడ్డి

బైక్ దొంగకు రిమాండ్


నిందితుడు అపహరించిన మోటార్‌సైకిల్

శాంతినగర్: రోడ్ల మీద జులాయిగా తిరుగుతూ దుకాణాల ముందు ఉంచిన మోటార్ సైకిళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనానికి పాల్పడుతున్న ఓ దొంగను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు శాంతినగర్ ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే ఐజ పట్టణానికి చెందిన నవీన్‌కుమార్ పని నిమిత్తం వెళ్తూ కొంకల స్టేజీ దగ్గర మోటార్‌సైకిల్ ఆపి టిఫిన్ చేసి బయటకు వచ్చాడు. తన బైక్ కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా కనిపించకపోవడంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసి ఉంటారని బావించి, గత నెల 29న శాంతినగర్ ఎస్‌ఐ సంతోష్‌కు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మరుసటి రోజు శాంతినగర్‌లోని రాఘవేంద్ర బైక్ మెకానిక్ షాప్‌కు నిందితుడు వచ్చి బైక్‌ను రూ.10 వేలకు అమ్ముతానని చెప్పాడు. డాక్యుమెంట్లు అడగ్గా లేవని చెప్పడంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు వెళ్లి బైక్ దొంగను పట్టుకుని విచారించగా, ఐజపురం గ్రామం, ఎర్రగిన మండలం, రాయచూర్ జిల్లాకు చెందిన కుర్వ వీరేష్ (26) గా నిర్ధారించారు. మద్యానికి బానిసై నిందితుడు రోజు మద్యం తాగి రోడ్లమీద తిరుగుతూ బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. గతేడాది గద్వాల పట్టణంలో, ఈఏడాది అయిజ పట్టణంలో ఇదే తరహాలో బైక్‌ల దొంగతనానికి పాల్పడగా ఆయా పోలీస్‌స్టేషన్‌లలో కేసు నమోదైనట్లు ఎస్‌ఐ వివరించారు. అలంపూర్ మెజిస్ట్రేట్ ముందు నిందితుడు వీరేష్‌ను హాజరుపరుచగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

జోరుగా ఉపాధి హామీ పనులు


వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

శాంతినగర్: పేదలకు పల్లెల్లో పనులు లేకపోవడంతో ఉపాధిహామీ పనులే దిక్కయ్యాయి. వేసవి కాలం పొలాల్లో పనులు లేకపోవడం, గతేడాది ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు నష్టపోయి ఆర్థిక ఇబ్బందుల ఏర్పడ్డాయి. కుటుంబాలు గడవక వారంతా ఉపాధి పనులకు వెళ్తున్నారు. దీంతో గ్రామాల్లో ఉపాధి పనులకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఉన్నత చదువులు చదివి ఉపాధిలేక నిరుద్యోగులుగా ఉన్న వారంతా వందరోజుల పనులకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ నెల నుంచి ఉపాధి కూలీ పెంచుతామని ప్రకటించడంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు ఆసక్తి పెరుగుతుందని కూలీలు చెబుతున్నారు.

మెరుగైన వైద్యం అందించండి

- ఎమ్మెల్యే విజయుడు


రాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

శాంతినగర్: అలంపూర్ నియోజకవర్గం నుంచి వివిధ సమస్యలతో వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే విజయుడు డాక్టర్లకు సూచించారు. వడ్డేపల్లి పురపాలికలోని శాంతినగర్‌కు చెందిన రాజుకు ఇటీవల కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేశారు. ఈ సందర్భగా రాజును ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం డాక్టర్లతో ఎమ్మెల్యే మాట్లాడారు. రాజు త్వరితగతిన కోలుకునేలా వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. అలంపూర్ నియోజకవర్గం నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు.

నందిన్నెలో పోలీస్ కవాతు


నందిన్నెలో పోలీస్ కవాతు నిర్వహిస్తున్న పారా మిలటరీ బలగాలు

కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని నందిన్నెలో పోలీస్ కవాతు నిర్వహించారు. సోమవారం నందిన్నె చెక్‌పోస్ట్ నుంచి ప్రధాన రహదారితో పాటు ఆయా వీధుల్లో పారా మిలటరీ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పారా మిలటరీ బలగాలతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. శాంతి భద్రతల రక్షణకు పోలీసులు ప్రజాసామ్య వ్యవస్థను ముందుకు తీసుకెళ్లేందుకు శాంతియుత వాతావరణం కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఐటీబీపీ సీఐ కమలేష్, ఆర్ఐ హరీష్‌తో కలిసి కవాతు నిర్వహించారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డ క్షేమం



మానవపాడు: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ రిజ్వానా తాన్విర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గర్భిణులకు సాధారణ కాన్పులు ఆరోగ్య కేంద్రంలో నిర్వహించాలన్నారు. వారికి రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న వారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. సత్యనారాయణ, హెలెన్, సంధ్యారాణి, చంద్రన్న, వినోదిని, సంధ్య పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలకు రంగులు వేయించండి

అయిజ: దేశానికి సేవలందించిన మహనీయుల జయంతి నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు సహకరించాలని అఖిలపక్ష కమిటీ నాయకులు కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఏఈ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 5న బాబు జగ్జీవన్ రాం, 11న మహాత్మ జ్యోతి బా పూలే, 14న అంబేద్కర్ జయంతి వేడకులను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, అంజి, శేఖర్, సుధాకర్‌గౌడ్, వేమన్న పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని షాబాద్‌కు చెందిన ప్రైవేట్ విద్యుత్ హెల్పర్ రాణాప్రతాప్ ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన హనుమాన్ యూత్ సభ్యులు సోమవారం షాబాద్‌కు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ. 27,700 నగదు అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు కృష్ణసాగర్, పరశురామ్, జమ్మన్న, పరుశ, రాంప్రసాద్, వెంకటేష్, తదితరులు ఉన్నారు.

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ


నందిన్నె చెక్‌పోస్టు తనిఖీ చేస్తున్న సీఐ లక్ష్మణ్ గౌడు

కేటీదొడ్డి: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాలు ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. సోమవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టును ఎక్సైజ్ సీఐ లక్ష్మన్‌గౌడు పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి మద్యం, లిక్కర్, డబ్బులు రాకుండా అధికారులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎవరైనా అనుమానితులు ఎవరైనా కనపడితే వారి వద్ద నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి పంపించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, సీఆర్‌పీఎఫ్, సిబ్బంది, సివిల్ పోలీసులు ఉన్నారు.

సరైన తేమశాతం వడ్లను తీసుకురావాలి


జింకలపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం

ఎర్రవల్లిచౌరస్తా: రైతులు కొనుగోలు కేంద్రాలకు సరైన తేమశాతం గల వడ్లను మాత్రమే తీసుకురావాలని ఏపీఎం కురుమయ్య సూచించారు. సోమవారం ఎర్రవల్లి మండలంలోని జింకలపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ 17శాతం తేమ ఉండేలా ఆరిన వడ్లను మాత్రమే రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 లు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ముఖ్యంగా వడ్లల్లో తాలు, రాళ్లు, మట్టి పెల్లలు లేకుండా తీసుకొచ్చి కేంద్రాల్లో ఉన్న అధికారులకు సహకరించాలన్నారు. ఏఈఓ ద్వారా ముందుగా టోకెన్ తీసుకొని క్రమ పద్ధతిలో కేంద్రానికి రావాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ బీచుపల్లి, గ్రామ ఐక్య సంఘం అధ్యక్షురాలు తులశమ్మ, గ్రామ ప్రజలు, రైతులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

గద్వాల అర్బన్: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘం గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు తొమ్మిది నెలలుగా వేతనాలు పెండింగ్ ఉన్నాయని, తద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలను చెల్లించాలని, లేదంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు, తదితరులు ఉన్నారు.

శ్రీశైలానికి భక్తుల పాదయాత్ర


పొలం బాటలో పాదయాత్ర చేస్తున్న భక్తులు


కర్రెల సహాయంతో శ్రీశైలానికి పాదయాత్రలో అల్లూరుకు చెందిన అనుమేష్

ఉండవెల్లి: కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో ధాన్యం బస్తాలు, సిరి సంపదలకు కోవెల బొమ్మలను ఎత్తుకుని అలంపూర్ జోగుళాంబ నుంచి శ్రీశైలానికి భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. ఈ నెల 9న ఉగాది సందర్భంగా శ్రీశైలానికి పాదయాత్రగా కర్ణాటక రాష్ట్రం నుంచి రాయచూరు, బీజాపూర్, బాగల్‌కోట్, కొప్పల్, బళ్లారి నుంచి భక్తులు అధిక సంఖ్యలో శివున్ని స్మరించుకుంటు పాదయాత్రలో పాల్గొంటున్నారు. కర్నూల్, అలంపూర్ డివిజన్‌లో జులకల్ స్టేజ్, అలంపూర్ చౌరస్తా, ఉండవెల్లి, డీ బూడిదపాడు గ్రామాల్లో, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు కర్రెల సహాయంతో నెలను తాకకుండా మొక్కులు తీర్చుకునేందుకు అడుగులు వేసుకుంటు అలంపూర్ క్షేత్రానికి బయలు దేరి శ్రీశైలానికి పాదయాత్ర చేస్తున్నారు. భక్తులు డప్పు చప్పుళ్లతో, భక్తి గీతాలతో బయలుదేరుతున్నారు. భక్తులకు రోడ్డు పొడవున దాతలు అన్నదాన కార్యక్రమం, మజ్జిగ, పండ్లు, చల్లటి నీరు అందిస్తున్నారు.

శ్రీశైలం యాత్ర భక్తులకు సేవలు

అయిజ: కర్ణాటక, మహరాష్ట్ర, బీజాపూర్ రాష్ట్రాల భక్తులు ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు కాలినడకన వెళ్తున్నారు. ప్రతిరోజు అయిజ పట్టణానికి చేరుకొని కొంచంసేపు సేదతీరి అక్కడ నుంచి పాదయాత్రను కొనసాగిస్తున్నారు. సోమవారం మండల కేంద్రంలో చాకలి వెంకటేష్ ఆంజనేయస్వామి ఆలయం ముందు శ్రీశైలం వెళ్తున భక్తులకు మంచినీరు, మజ్జిగను అందజేశారు. మండంలోని దేవబండ గ్రామానికి చెందిన నరసింహులు శేషమ్మ చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరం వద్ద పాదయాత్ర చేస్తున్న భక్తులకు మంచినీరు, మజ్జిగను అందజేశారు.


అయిజ శివారులో దాత ఏర్పాటు చేసిన మజ్జిగను సేవిస్తున్న భక్తులు

యువకుల ఔదర్యం

గట్టు: శ్రీశైలానికి పాదయాత్ర చేస్తున్న కర్ణాటక భక్తులకు మండల కేంద్రానికి చెందిన యువకులు దాహం తీర్చుతున్నారు. పాదయాత్ర చేసుకుంటూ వచ్చిన కర్ణాటక భక్తులకు గట్టు సమీపంలో చల్లని మజ్జిగతో పాటు చల్లని నీరు, అరటి పండ్లు అందించి ఉదారత చాటుకున్నారు. యువకులంతా కలిసి గట్టు సమీపంలో రోడ్డు పక్కన టెంటును ఏర్పాటు చేసి, భక్తుల దాహం తీర్చుతున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



గద్వాల అర్బన్: జిల్లాలోని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, ఇందుకోసం ప్రభుత్వం, అధికార యంత్రాగం చొరవ తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, విద్యార్థులకు మెరుగైన భోజనం అందించాలన్నారు. పెండింగ్‌లోని స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన జిల్లా కన్వినింగ్ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా ఆంజనేయులు, కో కన్వీనర్ శివ, సభ్యులను ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ, జిల్లా నాయకులు ఉన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం

మానవపాడు: వేసవిలో ఆయా గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని బోరవెల్లి, జల్లాపురం, గోకులపాడు, పెద్ద పోతులపాడు, గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చేతిపంపులు, పీడబ్ల్యూఎస్ మోటార్లకు మరమ్మతు చేయాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జల్లాపూర్‌లో ఫ్లో కంట్రోల్ తీసిన వాళ్లకి రూ.500 జరిమానా విధించామన్నారు. అనంతరం మండలంలోని 16 గ్రామ పంచాయతీ కార్యదర్శులకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మిషన్‌భగీరథ ఏఈ రాఘవేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బండ్ల గిరక పోటీలు

అయిజ: ఈస్టర్ పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సోమవారం కాలనీ వాసులు ఐదు ఎడ్ల బండ్ల చక్రాలకు తాళ్లు కట్టి, గిరక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండల కేంద్రంలోని వివిధ కాలనీలకు చెందిన ఎడ్లు హోరాహోరీగా తలపడ్డాయి. బుడుదల శాసనం ప్రథమ బహుమతి రూ. 20 వేలు, గొల్ల వెంకటేష్ ద్వితీయ బహుమతి రూ.15 వేలు, దుబ్బ జమన్న మూడో బహుమతి రూ.10వేలు, బోయ మహేష్ నాల్గవ బహుమతి రూ. 8వేలు, తెలుగు రాకేష్ ఐదో బహుమతి రూ.6 వేలు గెలుపొందారు. నిర్వాహకులు విజేతలకు నగదు అందజేశారు.

సదస్సు జయప్రదం చేయండి

గద్వాల అర్బన్: కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, నియంతృత్వ, కక్ష పూరిత విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 13న జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈ సదస్సుకు వామపక్ష వాదులు, మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వీవీ నర్సింహ, నర్సింహ, అంజి ఉన్నారు.